ప్రత్యర్థులెవరు..?





బీఆర్ఎస్ అభ్యర్థుల ఖరారుతో.. నియోజకవర్గాల్లో ప్రచార హోరు

- ఇమడలేక.. వెళ్లలేని సంకట స్థితిలో మైనంపల్లి, బేతి సుభాష్‌రెడ్డి
- కాంగ్రెస్, బీజేపీలలో టికెట్ కోసం పలువురి నేతల ప్రయత్నాలు
- అభ్యర్థుల ఎంపికపై అధిష్టానం కసరత్తు.. ఆశావహుల్లో ఉత్కంఠ
- ఎన్నికల వేళ.. మేడ్చల్ జిల్లాలో రాజకీయ 'సందడి'

సాక్షి, మేడ్చల్ జిల్లా: బరిలో నిలిచేదెవరు? గులాబీ పార్టీ అభ్యర్థులను ఢీకొట్టేదెవరు? అనే చర్చ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఊపందుకుంది. అనూహ్యంగా అధికార బీఆర్ఎస్ జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో పోటీలో నిలిపే వారి పేర్లను ఖరారు చేయటంతో అభివృద్ధి కార్యక్రమాలతో పేరుతో ప్రచార హోరుతో ప్రజలకు వద్దకు వెళ్తున్నారు. ఉప్పల్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డిని కాదని కొత్త వారికి ఇవ్వగా.. మల్కాజిగిరిలో సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లికి టికెట్ ఇచ్చినప్పటికీ, తనయుడికి మెదక్ టికెట్ కేటాయించలేదని అధిష్టానంపై ఆగ్రహంతో ఉన్నారు. ఈ ఇద్దరు సిట్టింగ్‌లు బీఆర్ఎస్‌లో ఇమడలేక.. బయటకు వెళ్లలేని సంకట పరిస్థితిలో సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు. మరో పక్క అధికార పక్షం అభ్యర్థులకు దీటుగా.. విపక్షాలు ఎవరిని రంగంలోకి దింపుతాయనే ఉత్కంఠ అందరిలో ఉంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ వ్యూహాలేంటి అన్న చర్చ కూడా జోరుగా సాగుతుండగా.. ఆ పార్టీలకు చెందిన ఆశావహులు మాత్రం పలు రాజకీయ, సామాజిక సమీకరణాల నేపథ్యంలో టికెట్ తమకే లభిస్తుందనే ధీమాతో వివిధ కార్యక్రమాల పేరుతో ప్రజల వద్దకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ల కోసం ఇప్పటికే పలువురు దరఖాస్తు చేసుకోగా, అధిష్టానం వడపోత కార్యక్రమాన్ని మొదలు పెట్టింది.

మల్కాజిగిరి

నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును అధిష్టానం ప్రకటించినా.. తనయుడు రోహిత్‌కు మెదక్ టికెట్ కేటాయించలేదన్న అసంతృప్తితో మంత్రి హరీష్‌రావుపై నిప్పులు చెరిగారు. ఈ విషయంలో మైనంపల్లి తీరుపై సీఎం కేసీఆర్ సహా వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రుగా ఉండగా, అధిష్టానం కూడా ఆయనపై వేటుకు రంగం సిద్ధం చేసినట్లు బీఆర్ఎస్‌లో చర్చ సాగుతోంది. బీఆర్ఎస్‌లో ఉండలేక.. బయటకు వెళ్లలేని సంకట పరిస్థితిని మైనంపల్లి ఎదుర్కొంటుండగా, అధిష్టానం కూడా మైనంపల్లిపై చర్యలకు సిద్ధపడకుండా మెత్తపడినట్లు ప్రచారం. ఒకవేళ అధిష్టానం మైనంపల్లి హన్మంతరావుపై సీరియస్‌గా వ్యవహరిస్తే.. మల్కాజిగిరి నుంచి మంత్రి మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి లేదా ఎమ్మెల్సీ శంబీపూర్ రాజును బరిలో దింపవచ్చనే చర్చ సాగుతోంది. మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ కోసం ముగ్గురు నాయకులు దరఖాస్తు చేసుకున్నా పార్టీ జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్‌కే దక్కుతుందని పార్టీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. మరో ఇద్దరు అన్నె వెంకట సత్యనారాయణ, బోనగిరి సురేష్‌యాదవ్ ఉన్నారు. మల్కాజిగిరిలో బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు, కొత్తగా పార్టీలో చేరిన ఆకుల రాజేందర్, యువమోర్చా నాయకుడు భానుప్రకాష్ పోటీ పడుతున్నారు.

కూకట్‌పల్లి

బీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మరోసారి కూకట్‌పల్లిలో ప్రచారం నిర్వహిస్తుండగా, కాంగ్రెస్ నుంచి కూకట్‌పల్లి టికెట్ కోసం 16 మంది నాయకులు దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ నుంచి దరఖాస్తు చేసుకున్న వారిలో గొట్టిముక్కల వెంగళరావు, సత్యం శ్రీరంగం, గాలివీర రామచంద్రబాలాజీ, పటోళ్ల నాగిరెడ్డి, వెలగపూడి వీవీస్ చౌదరి, మన్నె సతీష్‌కుమార్, ఆశపల్లి విజయచంద్ర, జాఫర్ అలీ, కొండకింది పుష్పారెడ్డి, దండుగుల యాదగిరి, మెడికొండ వెంకటమురళీ కృష్ణ, భక్త వత్సలం, జూలూరి ధనలక్ష్మీగౌడ్, పోట్లూరి శ్రీనివాస్‌రావు, దెరాటి మధుసాగర్, గొట్టిముక్కల పద్మరావు ఉన్నారు. కూకట్‌పల్లిలో బీజేపీ నుంచి అర్బన్ జిల్లా అధ్యక్షుడు పి.హరీష్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు మాధవరం కాంతారావు, కొత్తగా పార్టీలో చేరిన ప్రేమ్ కుమార్ పోటీ పడుతున్నట్లు పార్టీలో ప్రచారం జరుగుతోంది.

మేడ్చల్

సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి చామకూర మల్లారెడ్డికి మళ్లీ మేడ్చల్ టికెట్ దక్కడంతో బలమైన పోటీదారుడుగా ప్రచార పర్వంలో ముందువరుసలో ఉన్నారు. గడపగడపకూ కాంగ్రెస్ అనే నినాదంతో పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూరి వజ్రేష్(జంగయ్య)యాదవ్, అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి ప్రజల మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఇక్కడి నుంచి కాంగ్రెస్ టికెట్ కోసం వీరితోపాటు రోయ్యపల్లి మల్లేష్‌గౌడ్, పీసరి మహిపాల్‌రెడ్డి, పి.బాలేష్, గువ్వ రవి దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీ సామాజిక వర్గానికి టికెట్ ఇస్తే తొటకూరి వజ్రేష్(జంగయ్య)యాదవ్, రెడ్డి సామాజిక వర్గానికి కేటాయిస్తే హరివర్ధన్‌రెడ్డికి దక్కవచ్చనే ప్రచారం ఆ పార్టీలో సాగుతోంది. బీజేపీ నుంచి పార్టీ మాజీ ఉపాధ్యక్షుడు కొంపెల్లి మోహన్‌రెడ్డి, రూరల్ జిల్లా అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డితో సహా రాష్ట్ర స్థానిక సంస్థల అధ్యక్షుడు, రాష్ట్ర ఎంపీపీల ఫోరం అధ్యక్షుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి.

ఉప్పల్

◆ ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డిని కాదని, బండారి లక్ష్మారెడ్డికి బీఆర్ఎస్‌కు అధిష్టానం టికెట్ కేటాయించడంతో కార్యకర్తల సమావేశాల పేరుతో నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. దీంతో సిట్టింగ్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. తానేని తప్పు చేశానో చెప్పకుండా..టికెట్ నిరాకరించడంపై ఆయన గుర్రుగా ఉన్నారు. అనుచరులు, కార్యకర్తలతో చర్చించి పది రోజుల్లో కార్యాచరణ ప్రకటిస్తానని పేర్కొన్న తీరుపై పార్టీలో తీవ్ర చర్చ సాగుతోంది. అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి మాత్రం ప్రజల మద్దతు పొందేందుకు అనుచరులతో పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ నుంచి ఉప్పల్ టికెట్ కోసం ఆరుగురు నాయకులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో ఎం.పరమేశ్వర్‌రెడ్డి, సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి, మేకల శివారెడ్డి, పసుల ప్రభాకర్‌రెడ్డి, అమరిశెట్టి నరేందర్ ఉన్నారు. టికెట్ విషయంలో ముగ్గురి మధ్యే పోటీ ఉండగలదని పార్టీలో ప్రచారం సాగుతోంది. బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే ఎన్ఎస్ఎస్ ప్రభాకర్‌తో పాటు మరో నాయకుడు పద్మారెడ్డి పోటీ పడుతున్నారు. అధిష్టానం మాత్రం మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ వైపు మొగ్గు చూపవచ్చనే ప్రచారం పార్టీలో సాగుతోంది.

కుత్బుల్లాపూర్

సిట్టింగ్ ఎమ్మెల్యే కేపీ వివేకానందగౌడ్‌కు బీఆర్ఎస్ మళ్లీ టికెట్ కేటాయించడంతో.. అభివృద్ధి పనుల పేరుతో ప్రజల వద్దకు వెళ్తుండగా, కాంగ్రెస్ నుంచి టికెట్ కోసం 12 మంది నాయకులు దరఖాస్తు చేసుకున్నారు. నర్సారెడ్డి భూపతిరెడ్డి, కొలన్ హన్మంతరెడ్డి, కందాడి జ్యోత్సదేవి, సొంటిరెడ్డి పున్నారెడ్డి, ఉసిరిక అప్పిరెడ్డి, మహ్మద్ నిజాముద్దీన్, గుంజ శ్రీనివాస్, బండి సత్యంగౌడ్, దూళిపాక సాంబశివరావు, పోలీసు సుమిత్రారెడ్డి, అహ్మద్ నిజామొద్దీన్, బోనగిరి ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు. ఇక్కడ బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి పోటీకి ఆసక్తి చూపుతున్నారు.

క్లుప్తంగా...

నేడు, రేపు ఎలక్షన్ స్పెషల్ క్యాంపెయిన్ డే

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డి.అమయ్‌కుమార్



సాక్షి, మేడ్చల్ జిల్లా: నేడు, రేపు ఎలక్షన్ స్పెషల్ క్యాంపెయిన్ డే సందర్భంగా మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని అన్ని గ్రామాల పోలింగ్ స్టేషన్ కేంద్రాల్లో ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డి.అమయ్‌కుమార్ తెలిపారు. బూత్ లెవెల్ అధికారులు తమ పోలింగ్ స్టేషన్ కేంద్ర పరిధిలో అందుబాటులో ఉంటారని, ఓటు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ఓటు నమోదుపై విస్తృతంగా ప్రచారం చేసి, అవగాహన కల్పించాలన్నారు.

ఏకగ్రీవంగా ఆమోదం

కీసర: కీసర గ్రామపంచాయతీ పరిధిలోని అనుబంధ గ్రామమైన కీసరదాయర (పోలింగ్ స్టేషన్–191)ను నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసుకునేందుకు శనివారం కీసర గ్రామసర్పంచ్ నాయకపు మాధురి అధ్యక్షతన నిర్వహించిన గ్రామ పంచాయతీ సమావేశంలో సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. పంచాయతీ పాలకవర్గం సమావేశంలో తీర్మానించిన కాపీని కీసరదాయర గ్రామస్తులకు అందజేశారు. కీసర పంచాయతీ పాలకవర్గం అందజేసిన తీర్మానం కాపీని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు అందజేసేందుకు కీసరదాయర గ్రామస్తులు మంత్రి నివాసానికి తరలివెళ్లారు.

రాఘవేంద్రస్వామి ఆలయంలో ఆరాధనోత్సవాలు



మేడ్చల్: పట్టణంలోని అత్వెల్లి పరిధిలోని రాఘవేంద్రస్వామి ఆలయంలో ఆరాధనోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. మఠం స్వాములు ఆలయంలో 353వ ఆరాధనోత్సవాలను నిర్వహించి ప్రవచనాలు చేశారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాల్లో మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వీరభద్రారెడ్డి, శంకర్ భక్తులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి



మేడ్చల్‌రూరల్: కీసర మండలం రాంపల్లికి చెందిన లింగాల పుష్పలత ఆధ్వర్యంలో ఏర్పడిన సర్వ అభిజ్ఞా ఫౌండేషన్‌ను శుక్రవారం బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ప్రారంభించారు. మేడ్చల్ మండలం పూడూర్ పరిధిలోని ఈటల నివాసంలో మహిళలతో కలిసి వెబ్‌సైట్ ప్రారంభించిన ఆయన మహిళలు స్వయం ఉపాధితో పాటు ఆర్థికంగా ఎదిగేలా ఈ సంస్థ పనిచేయాలని ఆకాంక్షించారు.

నేడు అహ్మద్‌గూడలో డబుల్ ఇళ్ల పంపిణీ

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని అహ్మద్‌గూడ ఆర్‌జీకే కాలనీ సమీపంలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో 1500 మంది లబ్ధిదారులకు మంత్రి మల్లారెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఇళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించేందుకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తం 41 బ్లాకుల్లో మొత్తం 4,428 డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించారు. మొదటి విడతలో భాగంగా, మల్కాజిగిరి, ముషీరాబాద్, సికింద్రాబాద్ నియోజకవర్గాలకు చెందిన ఒక్కో నియోజకవర్గం నుంచి 500 మంది లబ్ధిదారుల చొప్పున పంపిణీ చేస్తారు.

గంజాయి స్వాధీనం

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లో గంజాయి విక్రయిస్తున్న వారిపై మల్కాజ్‌గిరి ఎస్‌ఓటీ పోలీసులు, స్థానిక పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు నిర్వహించారు. అవుషాపూర్‌కు చెందిన సనాతన్ నాయక్ (61), ఘట్‌కేసర్ రైల్వే గేటు సమీపంలో నివసించే అమర్ పండిత్ (37), సుభోద్ కుమార్ పండిత్(33), మనోజ్ పండిత్‌ను అదుపులోకి తీసుకొని 82 గంజాయి ప్యాకెట్లు(కిలో) స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రంలో హ్యాట్రిక్ అధికారం బీఆర్ఎస్‌దే..

మంత్రి మల్లారెడ్డి



మూడుచింతలపల్లిలో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

శామీర్‌పేట్: రాష్ట్రంలో హ్యాట్రిక్ అధికారం బీఆర్ఎస్‌దేనని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఉమ్మడి శామీర్‌పేట మండలంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా శామీర్‌పేట మండలం లాల్‌గడి మలక్‌పేట, మూడుచింతలపల్లి మండలంలోని పలువురు ఇతర పార్టీల నుంచి మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై నాయకులు పార్టీలో చేరేందుకు మొగ్గుచూపుతున్నారని తెలిపారు. సీఎం కేసీఆర్‌ను ఢీ కొట్టే నాయకుడే లేడని, హ్యాట్రిక్ సీఎం అవడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు యెల్లుబాయి, హారిక, పార్టీ మండల అధ్యక్షుడు సుదర్శన్, మల్లేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి అనిల్‌రెడ్డి, సర్పంచ్‌లు జాంరవి, హరిమోహన్‌రెడ్డి పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డబుల్ ఇళ్లను స్థానికులకు కేటాయించాలి



ఘట్‌కేసర్: కేంద్ర ప్రభుత్వ నిధులతో ప్రతాపసింగారంలో నిర్మించిన రెండు పడకల ఇళ్లను అర్హులైన స్థానికులకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామంలోని రెండు పడకల భవనం సముదాయం వద్ద బీజేపీ మండల అధ్యక్షుడు చలువాదీ ప్రవీణ్ రావు అధ్యక్షతన శుక్రవారం నిరసన చేపట్టారు. ముఖ్యఅతిథులుగా ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శోభారాణి, రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం నిధులతో ఇళ్లను నిర్మించి సీఎం కేసీఆర్ నిర్మించాడని అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మోహన్‌రెడ్డి, కార్పొరేటర్ పవన్‌రెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పవన్‌రెడ్డి, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు శ్రీశైలం, ప్రభంజన్‌గౌడ్, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ జేమ్స్ వర్ధంతి




జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని గృహలక్ష్మీ సేవా సమితి కార్యాలయంలో శుక్రవారం పీవోడబ్ల్యూ(విముక్తి) పుణ్యవతి ఆధ్వర్యంలో కామ్రేడ్ జేమ్స్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఫ్టూ జాతీయ కార్యదర్శి షేక్ షావలి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజా సంఘాల నాయకులు నర్సన్న, బాలు, మమత, ప్రియాంక, నాగమణి, యమున, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులకు వాక్-ఇన్ ఇంటర్వ్యూ

డీఎంహెచ్ఓ డాక్టరు పుట్ల శ్రీనివాస్

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా వైద్యారోగ్యశాఖలోని పీహెచ్‌సీల్లో ఖాళీగా ఉన్న డీఇఓ, కేసీఆర్ కిట్ డీఇఓ పోస్టులను అవుట్ సోర్సింగ్ పద్ధతిలో వాక్-ఇన్ ఇంటర్వ్యూ ద్వారా భర్తీ చేయనున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టరు పుట్ల శ్రీనివాస్ తెలిపారు. ఈ పోస్టుల భర్తీకి అర్హత కల్గిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. బీకామ్(కంప్యూటర్స్), బీఎస్సీ(కంప్యూటర్స్) అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 2న మధ్యాహ్నం 12 గంటలకు మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో జరిగే వాక్-ఇన్ ఇంటర్వ్యూకు హాజరు కావాలని ఆయన కోరారు.

కీసరగుట్ట ఆలయ చైర్మన్ జన్మదిన వేడుకలు



కీసర: మంత్రి మల్లారెడ్డి సమక్షంలో శుక్రవారం కీసరగుట్ట ఆలయ చైర్మన్ తటాకం రమేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ రమేష్ చేత మంత్రి మల్లారెడ్డి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వరస్వామి సేవలో పాల్గొన్నారు. వేద పండితులు స్వామివారి ఆశీర్వచనం, మహాప్రసాదాన్ని అందజేసారు.

రోడ్డుపై అక్రమ నిర్మాణాలను తొలగించాలి



మేడ్చల్‌రూరల్: మండలంలోని పూడూర్ గ్రామంలోని 10 వార్డులో సీసీ రోడ్డు మధ్యలో అక్రమ నిర్మాణాలను తొలగించాలని గ్రామ నాయకులు పెంటారెడ్డి గ్రామ పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీకి చెందిన సీసీ రోడ్డు మధ్యలో సర్పంచ్ కుటుంబీకులు అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని, వాటిని వెంటనే తొలగించాలని అధికారులను కోరారు.

రూ.3.6 కోట్లతో అభివృద్ధి పనులకు ఓకే



కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని 18 వార్డుల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.3.6 కోట్ల మున్సిపల్ సాధారణ నిధులను వెచ్చించాలని నిర్ణయించినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ వసుపతి ప్రణీత అన్నారు. శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీత అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సమస్యలను పరిష్కరించేందుకు రూ.3.6 కోట్ల మేర నిధులతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు సమావేశంలో సభ్యులు తీర్మానించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కమిషనర్ రాజమల్లయ్య, డీఈఈ చిరంజీవులు, టీపీఓ శ్రీధర్‌ప్రసాద్, మేనేజర్ వెంకటేషం, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో 'శ్రీనిధి' చెలగాటం

ఘట్‌కేసర్: విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న శ్రీనిధి కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో శ్రీనిధి కాలేజీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ప్రశ్నించిన విద్యార్థులపై దాడి చేయడం సిగ్గుచేటన్నారు. శ్రీనిధిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి అన్వర్, ఉపాధ్యక్షుడు హరీశ్, నాయకులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో జాతీయ స్థాయిలో రాణించాలి



కీసర: ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో నిర్వహించనున్న జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో నాగారం మున్సిపాలిటీకి చెందిన టైగర్స్ క్లబ్ తైక్వాండో అకాడమికి చెందిన 30 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. జాతీయస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు బయలుదేరిన వారికి నాగారం మున్సిపల్ బీఆర్ఎస్ యూత్ నాయకుడు కొకుట్ల రాహుల్‌రెడ్డి ఆల్ ది బెస్ట్ చెప్పారు. కోచ్ జీ.శివకుమార్, పోతుల రాకేష్ యాదవ్, క్రీడాకారుల తల్లిదండ్రులు ఉన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

మేడ్చల్ జిల్లా ఉపాధ్యాయ సంఘాల డిమాండ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: సీపీఎస్ రద్దు చేసి, ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని మేడ్చల్ జిల్లా ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, కీసర ఆర్డీఓ, కలెక్టరేట్ ఏఓలకు ఆ సంఘాల నేతలు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఎదుట కొద్దిసేపు ఉపాధ్యాయులు ఆందోళన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో టీయూటీఎఫ్, పీఆర్‌టీయూ మేడ్చల్ జిల్లా నాయకులు రామినేని వెంకటేశ్వర్లు, యు.విఠల్, టి.మోహన్‌బాబు, ఏ.శివకృష్ణ, రామేశ్వర్‌గౌడ్, ఆనంద్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2004 సెప్టెంబర్ తర్వాత నియామకమైన ఉద్యోగ ఉపాధ్యాయులకు పెన్షన్ తొలగించడం బాధాకరం అన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

మేడ్చల్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పాఠశాలల వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఉద్యోగులకు శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని తపస్ రాష్ట్ర కార్యదర్శి గడప నవీన్ డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శైలజకు వినతి పత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శి గోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులకు వినతి

కీసర: సెప్టెంబర్ 1వ తేదీని పెన్షన్ విద్రోహదినంగా పాటిస్తూ నల్ల బ్యాడ్జీలతో కీసర మండలంలోని వివిధ స్కూళ్లలో నిరసన తెలిపారు. సీపీఎస్ రద్దు కోరుతూ కీసర తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు పీఆర్‌టీయూటీఎస్ సంఘం ఉపాధ్యాయులు వినతి పత్రం అందజేశారు. పీఆర్‌టీయూటీఎస్ కీసర మండల ప్రధాన కార్యదర్శి చీర యాదగిరి, జిల్లా బాధ్యులు వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, జనార్దన్, రజినీకాంత్‌రెడ్డి, మండల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: సమాజంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా టెక్నాలజీని అందిపుచ్చుకుని ముందుకు సాగేవారు ధనవంతులని మంత్రి మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ ఐటీ కళాశాల ఓరియంటేషన్ డేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి ప్రపంచంలో నూతన ఒరవడితో టెక్నాలజీని వినియోగించుకుంటే ఉన్నత స్థానాల్లో నిలుస్తారని తెలిపారు. నాలుగేళ్ల ఇంజినీరింగ్ విద్య పూర్తయ్యేంత వరకు విద్యార్థులు అన్నింటికీ దూరంగా ఉండి చదువులపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి, సీఎంఆర్ఐటీ డైరెక్టర్ జంగారెడ్డి, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, భూపాల్‌రెడ్డి, శ్రీశైలంరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్‌లో కీలకపాత్ర పోషించాలి



అతిథిని సన్మానిస్తూ..

మేడ్చల్: సాంకేతిక విద్య నేర్చుకోవడానికి కళాశాలలో చేరే విద్యార్థులు తమ చదువులు పూర్తయిన తర్వాత తాము నేర్చుకున్న విద్యను దేశ శ్రేయస్సుకు వినియోగించాలని కిష్టాపూర్ మల్లారెడ్డి ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్ కళాశాల చైర్మన్ వేముల మల్లారెడ్డి అన్నారు. కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు కేవలం ఉద్యోగాల కోసం చదువులు కొనసాగించకుండా దేశ భవిష్యత్‌లో కీలకపాత్ర పోషించాలని సంకల్పంతో ముందుకు సాగాలన్నారు. కార్యదర్శి కృష్ణారెడ్డి, డైరెక్టర్లు రాఘవేందర్‌రెడ్డి, భరతసింహారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, మాజీ వైస్ చాన్స్‌లర్ కిషన్ కుమార్‌రెడ్డి, కల్నల్ డాక్టర్ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టార్టప్ దిశగా కృషి చేయాలి



మాట్లాడుతున్న నల్లా మల్లారెడ్డి

ఘట్‌కేసర్: విద్యలో నాణ్యత, క్రమశిక్షణ విద్యార్థులను మేటి పౌరులుగా తీర్చిదిద్దుతుందని నల్లా మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి నల్లా మల్లారెడ్డి అన్నారు. కాచవానిసింగారం నల్లా మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కళాశాల డైరెక్టర్ నల్లా దివ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ టెక్నికల్ కళాశాలలో..

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ టెక్నికల్ కళాశాలలో శుక్రవారం ఓరియంటేషన్ డే నిర్వహించారు. కళాశాల చైర్మన్ గోపాల్‌రెడ్డి పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కళాశాలలో మొదటి సంవత్సరంలో అడుగు పెట్టిన విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్య, టెక్నాలజీపై అవగాహన కల్పించారు. కళాశాల డైరెక్టర్ రాజిరెడ్డి, సీఈఓ అభినవ్‌రెడ్డి, సెక్రటరీ వసంతలత, హెచ్‌ఓడీ కేశవ్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ పీఓ దుర్గాప్రసాద్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.